# రుచులు

బలివాడ కాంతారావు



సుబ్బారావు ఇంట్లో ఈ డైనింగు టేబిలు బాబు పుట్టక ముందునించి ఉంది. ఆ టేబిల్ మీద ఎన్నెన్ని రుచులు తిన్నారో, అంతకన్నా ఎక్కువగా ఆప్యాయతతో కబుర్లు ఆ టేబిలు చుట్టూ కూర్చొనే చెప్పుకునేవారు. ఈ బాబు పుట్టాక, ఆ టేబిల్ మీద కూర్చొనే ఉగ్గూ పాలూ తాగుతూ, తరవాత అమ్మ పెట్టిన రుచికరమైన వంటకాలు తింటూ పెరిగాడు.

బాబు అసలు పేరు వీర సత్య శ్రీనివాసబాబు. తాము గౌరవించే పెద్దలనూ, కొలిచే దేముణ్ణీ చేర్చితే వంశోద్ధారకుడై కీర్తి ప్రతిష్ఠలతో వర్ధిల్లు తాడని తలిదండ్రులు గంపెడాశతో ఆ పేరు పెట్టారు.

వినలాడే సుబ్బారావు ఇంటికొస్తే మాత్రం అంతా తను కోరినట్టుగా ప్రశాంతంగా ఉండటం వలన ఎక్కడలేని తృప్తి ఉండేది. ఆదుపులో పెరిగిన కొడుకు, అడవిలాంటి ఆ మహా పట్నంలో అడ్డ దిడ్డంగా పరిగెత్తే అడవిగుర్రం మాత్రం కాలేడని అతగాడి ధీమా! తన ముత్తాతలనించి పేరు పడ్డ వంశం. మూడు తరాల్లో ఏ తరంలో ఏ ఒక్కరిపేరు చెప్పినా సంఘంలో గౌరవంగా చూస్తారు. పెద్దలు ఆర్జించిన వంశ మర్యాద అంబారీ ఏనుగులా ఉంది. అది ఎక్కివెళ్ళిన కొడుకును ఎవరు ఆహ్వానించరు?

ఆరు నెల లయ్యాక కొడుకు సెలవుల్లో ఇంటికి వచ్చాడు. ఇదివరలా కాలేజీ తప్పితే ఇంట్లో చెల్లెళ్ళతో

వాడు మూడు వందల మైళ్ళదూరంలో ఉన్న యూని వర్సిటీకి వెళ్ళిపోయి, తొలిసారిగా తమకు దూర మైనా, రోజూ ఆ టేబిలు దగ్గర ఆ కొడుకు కబుర్లే! వాడి కళ్ళద్దాలనించి కనబడే అమాయకమైన చూపు. అసలు మాటలే వినిపించేవి కావు. ఆ చిరు నగవుతో ఇచ్చే సమాధానంలోనే వాడి వినయ విధేయతలు కొట్టవచ్చినట్టు కనపడేవి. ఎవరున్నా, ఎవరువచ్చినా, వాడులేని వెలితిస్పష్టంగా కనిపిస్తూంది. సుబ్బారావు ఆఫీసులో ఉంటాడు. సుందరమ్మకు మాత్రం తలుచుకున్నకొద్దీ కళ్ళలో నీరు కారటం తగ్గలేదు.

సరిగ్గా పని చెయ్యని వాళ్ళ మీద ఆఫీసులో విస

ఆడుకోవటమో, లేక పుస్తకం పట్టుకోవటమో చేస్తా డనుకుంటే వూరిమీద పడ్డాడు. హాస్టలు భోజ నంతో సగం చిక్కాడని తల్లి కన్నీరు తెచ్చుకున్నా వెంటనే వాడికిష్టమైన పప్పూ గోంగూర, వంకాయ ముద్దకూర, ఆదివరకే చేసిన దోసకాయ పచ్చడి, బెల్లంతో చేసిన పాయసం అన్నీ సిద్ధం చేసుకుని డైనింగ్ టేబిలు దగ్గర కూర్చుంది. రాత్రి ఏడైంది. ఎనిమిదైంది. ఇంకా రాడే! ఇంట్లోకి, వీధిలోకి ఇటూ అటూ అవుతుంటే పొరుగు కుర్రాడు వచ్చి అన్నాడు:

''పిన్నిగారూ! మీ బాబును హోటల్లో చూశాను.''

''వాడికి హోటల్‌కి పోయే ఖర్మ ఎందుకు? ఎవర్ని చూశావో!''

''లేదు. మీ బాబే పిన్నిగారూ. స్నేహితులతో కలిసి ఆమ్లెట్ తింటున్నాడు.''

''వాడికి స్నేహితు లెవరున్నారు—కోడి గుడ్డు పేరెత్తితేనే వాడికి డోకొస్తుంది.''

ఇంతలో కొడుకు కనిపించాడు.

''నా కొడుకు మీద చాడీలెందుకు చెప్తావ్? నిన్ను కొట్టాడా—తిట్టాడా?''

''చాడీలేంటమ్మా?'' అంటూ బాబు గడపలో కాలు పెట్టాడు. పొరుగు కుర్రాడు ముందుకొస్తూ అడిగాడు.

''బాబూ! నువ్వు సాయంత్రం హోటల్లో ఆమ్లెట్, బ్రెడ్ తినలేదూ?''

''తిన్నాను.''

''పిన్నిగారూ—మీ రన్న మాటలన్నీ మీకే వాపస్!'' అంటూ లోపలికి వెళ్ళిపోయాడు కుర్రాడు.

భోజనం దగ్గర ఎవరూ మాట్లాడలేదు. అమ్మ వండినవన్నీ పేరుకు ముట్టుకున్నాడు. అంతే. ఇంత వేగిరం కొడుకు జిహ్వకు అలవాటైన రుచులు ఇలా పనికి రాకుండా పోతాయని ఆమె కలలోనైనా వూహించలేదు.

అంతా వింటున్న సుబ్బారావు కోపంతో కుత కుత ఉడికి పోతున్నాడు. తల్లి మాత్రం చివరకు ఆ వదలిన వంటకాలను చూస్తూ అంది:

''ఇన్ని సంవత్సరాలు లేని అలవాటు ఈ ఆరు నెలల్లోనే అబ్బాలా? బాబుతో కూడిన గ్రహాలేవో వాడిని పాడుచేస్తున్నాయండీ!''

''వాళ్ళందరినీ ఎందు కాడిపోస్తావ్? వీడికి బుద్ధి ఉండక్కర్లే?''

''మరి తినకురా! నువ్వు తింటే నీ పిల్లలూ తింటారు. వంశమంతా కలగాపులగమైపోతుంది. అప విత్రమైపోతుంది'' అన్నది తల్లి.

''వాడికి కొమ్ము లొచ్చాయి జాగ్రత్త.'' సుబ్బా రావు వేళాకోళంగా మాటలు దొర్లించాడు.

''బాబు ఎప్పుడు మన మాటకి ఎదురు తిరిగాడు. మీ రలా అంటున్నారు?''

సుబ్బారావుకు ఇంట్లో తొలిసారి ఆఫీసులో వస్తున్న చిరాకూ, కోపం వచ్చి లేచిపోతూ అన్నాడు:

''ఈసారి వచ్చినప్పుడు కోడి మాంసం తింటాడు. అది అరగడానికి తాగినా తాగుతాడు. ఆ పట్నంలో వీధికి అరడజను బ్రాందీ షాపు లున్నాయిలే!''

ఇంత అన్నా బాబు జవాబు చెప్పలేదు. ఇటూ అటూ చూసి బయటకు వచ్చేశాడు. సుబ్బారావు ఇంకా గొణుక్కుంటూంటే సుందరమ్మ వాదిస్తోంది.

''ఏదో చిన్న పొరపాటు చేశాడు. మానేమన్నాంగా! మీరు అదేపనిగా వాడు మాంసం తింటాడు—కల్లు కొట్లలో దొర్లుతాడంటే వాడి మనసు పాడవదా?''

''ఎంత కష్టపడి చదివిస్తున్నానో నీకేం తెలుసే? గీటు దాటనంతసేపూ మన వాడు. గీటు దాటా డెప్పుడో — రావణాసురు లెందరో కాచుకుని ఉంటారు!''

''మన బాబు అంత చేతకాని వాడు కాదులెండి.''

''నోరుముయ్!'' పెద్ద కేక వినపడింది.

''అంతా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దం ఇంట్లో వారం

రోజుల వరకు ఉంది. నిశ్శబ్దంగా తింటున్నారు. నిశ్శబ్దంగా నడుస్తున్నారు. ఏవిమిదో రోజున డైనింగ్ టేబిలు దగ్గరే సుబ్బారావు పెద్ద లెక్చరిచ్చాడు. మనుధర్మ శాస్త్రం దగ్గర నుంచి సంప్రదాయాల వరకు కూలంకషంగా చెప్పాడు. చిన్నప్పట్నించీ ఈ టేబిలు దగ్గరే కొడుక్కి సుమతి శతకం నించి భగవద్గీత వరకు బోధించాడు.

"మన చరిత్ర మన్నులో పర్చైన విత్తనం నాటగా మొలిచిన మొక్కవు నువ్వు. నీ వంశం అందిచ్చిన కీర్తి నీకు పరుగెత్తడానికి బలం ఇస్తున్నది. నువ్వా ఆ కీర్తికి మరింత కీర్తి కలిపితేగానీ ముందు తరానికి గతి లేదు."

ఇంకా ఇలా ఇప్పటికీ చిన్న పిల్లాడికి చెప్పినట్లు సుబ్బారావు చెప్తుంటే, కొడుకు తలైనా ఎత్తలేదు. తొలిసారి కొడుకు తనను అనుమానంతో చూస్తున్నాడని సుబ్బారావుకు తట్టింది. వాడి చూపు, నడత ఇదివరకటి కన్నా భిన్నంగా ఉంది. ఇన్ని ఏళ్ళూ తను జాగ్రత్తగా నాటి, పెంచి, పెరిగిన మొక్క స్థలం మార్చివెయ్యగానే కొమ్మలు రాలుస్తున్నట్టనిపించింది. వాడు గర్భంలో ఉన్న దగ్గర నించి రోజు రోజుకూ ఈ ఒక్క కొడుకుపై పెరుగుతూ వచ్చిన ఆశలు నూరిన గంధం సువాసన బదులు దుర్వాసన వేస్తే తను ఎలా భరించగలడు?

వెళ్ళిపోయేవరకు మళ్ళీ అవకాశం దొరికినప్పుడల్లా ఇంతో అంతో సుబ్బారావులో ఉన్న శ్లేషను వాడే ప్రజ్ఞతో కొడుక్కి బోధించాడు. గడి తప్పిన వాడిని మళ్ళీ గడిలోకి తేగలనని నమ్మాడు.

నమ్మకం పెరుగుతూనే ఉంది. అందుకే కొడుక్కి డబ్బు తను బాధపడైనా పంపిస్తూ ఉన్నాడు. ఈ సారి సెలవులకు వచ్చినప్పుడు చెడ్డ కబుర్లు ఏమీ వినలేదు గానీ, మనిషి రూపు మారింది. మీసాలు పెంచాడు. జుత్తు పెరిగింది. ఈ వేషం నచ్చలేదని చెప్పే బదులు తన జుత్తు దగ్గరగా వేసవి క్రాపులా సుబ్బారావే ఉంచుకున్నాడు. ఇది చూసైనా కొడుకు వేషం మార్చలేదు. ఆ ఏనుగు కాళ్ళ పేంటు, ఆ జాకెట్ గుడ్డ స్లాక్ మరీ బాగు లేదు. ఇక ఆ బూట్లు తొక్కుతుంటే భూకంపం వచ్చేటట్టుంది. కళ్ళద్దాలు కొబ్బరి చిప్పంతేసి ఉన్నాయ్. కొడుకు ఎదురుగా అనకుండా సుందరమ్మ తోనే సుబ్బారావు అభిప్రాయాలన్నీ వర్ణించాడు.

"కళ్ళెం చేత ఉన్నంత కాలమే గుర్రం. కళ్ళెం వదిలేస్తే అంతే!" అన్నాడు. అప్పటికీ అభిప్రాయం ఇవ్వని పెళ్ళాంతో... "ఇలాగ మారి మారి ఆఖరికి ఏ అమ్మాయినో తెస్తాడు కోడలుగా! ఆ కోడలు దగ్గర ఆర్డర్లు తీసుకుంటూ, సేవచేసుకుంటూ బతుకుతావు" అని వేళాకోళం ఆడినా సీరియస్‌గానే అన్నాడు.

"మీ కింత సేవ చేసుకుని బతికితే నాకు మోక్షంగానీ..."

"ఒక్కగాని ఒక్క కొడుకు— ముద్దుల కొడుకును వదిలి బతగ్గలవా?"

ఈ ఊహలు ఎంతవరకు నిజమవుతాయోగానీ ఒక నిజం హఠాత్తుగా సుబ్బారావు చెవిలో పడింది. ఆఫీసునించి గబగబ ఇంటికి వచ్చేశాడు. డైనింగ్ టేబిలు మీద కాలు పెట్టుకుని కొడుకు ఏదో

> స్వతంత్రాన్ని అనుభవించే సత్తా, యోగ్యత కలిగే వరకు స్వతంత్రం ఇవ్వకూడదనడం ఈత వచ్చేవరకు నీళ్ళలో దిగకూడదు అనడం వంటిది.
>
> — మెకాలే

పుస్తకం చదువుకుంటున్నాడు.

"ఒపే సుందరం" అని కేక వేశాడు సుబ్బారావు. సుందరమ్మ వంట ఇంట్లోంచి వచ్చింది.

"విన్నావా ఏం జరిగిందో?"

"ఏం జరిగిందండీ?"

"మనవాడు ప్రొఫెసర్‌నే సవాల్ చేశాడట."

"చేస్తే?"

"వాడిని సవాల్ చేస్తే ఏమవుతుంది? వీడి పరీక్షని కాల్చేస్తాడు."

"వాడేం న్యాయంగా పోయే పరమశివుడా మూడో నేత్రం విప్పడానికి?' అనుకోని సమాధానం కొడుకు దగ్గరనించి రాగానే కోపం పట్టలేక పోయాడు సుబ్బారావు.

"వీకేం అన్యాయం చేశాడురా?"

"నాకు కాదు — నా క్లాసులో వాడికి. ఎవరో ఒకరు గంట కట్టకపోతే ఆ టక్కరి పిల్లితో వడలేక పోతున్నాం."

"అందుకు నువ్వే ముందు కొచ్చి, మా ఆశలన్నీ చంపుతావురా?"

సుబ్బారావు ఏదో అరుస్తున్నా బాబు జవాబు చెప్పక పుస్తకం వేపు చూస్తూ చదువుతున్నట్లు నటించేవు చేసుకోలేదు. ఆ టేబిలు దగ్గర రాత్రి భోజనం చేస్తూ అన్నాడు సుబ్బారావు:

"నా మాట పట్టించుకోనివాళ్ళు ఆఫీసులోనూ, మన చుట్టాల్లోనూ, స్నేహితుల్లోనూ —అంతా పాడయ్యారు. సరే!నాకూ తెలుసుఏం చెయ్యటమో?"

కొడుకు జవాబు చెప్పలేదు. మళ్ళీ యూనివర్సిటీకి వెళ్ళాక వారం రోజుల నాడు డైనింగ్ టేబిలు అడుగున అంటించిన కాగితం సుబ్బారావు కూతురు చూసి... "అన్నయ్య రాతలా ఉంది" అంది.

సుబ్బారావు గబ గబ వచ్చి ఆ కాగితం జాగ్రత్తగా విప్పి బయటకు తీశాడు. ఇంగ్లీషులో రాసిన పద్యంలో లైనులు గట్టిగా చదివాడు.

"సుందరీ — మన సుపుత్రుడు నన్ను ఈ కర్ర ముక్కతో పోల్చాడే— నేను ప్రాణం లేని కర్ర ముక్కనే — డైనింగ్ టేబుల్‌నే!"

"బాబ్బా! వాడేదో ఉబుసుపోకకు రాస్తే మా రన్ని అర్థాలు తీసుకుంటే ఎలా?"

"మీరంతా ఒక్కటే. నే నొక్కడినే ఒక్కటి. సరా!" అంటూ వెళ్ళిపోయాడు బయటకు.

తన బొటన వేలు తెగిపోయినట్లనిపించింది. ఈ స్ప్రింగ్ అందుకే ఎక్కడకో ఎగిరి పోయింది. అయినా మనసులో మంట అంత వేగంగా చల్లారేటట్లు లేదు. డబ్బు పంపడం రెండు నెలలు మానేశాడు. తెల్గ్రాం డబ్బుకోసం వస్తుందనుకుంటే ఉత్తరమైనా రాలేదు. పెళ్ళాం పోరు పడలేక మనియార్డరు చేసి ఆ తడుగు కూపనులో — "సస్పెన్షన్‌లో ఉన్నావని తెలిసింది. నా కష్టార్జితం అనవసరంగా గంగలో కలవడం ఇష్టంలేదు. ఈ డబ్బు మీ అమ్మ రెండేళ్ళనించీ చేసుకున్న పొదుపు" అని రాశాడు. మనియార్డరు పుచ్చుకోలేదు. తిరిగి వచ్చింది. నెల, రెండు నెలలు, పెళ్ళాం గట్టిగా ఏడ్చిందని సుబ్బారావు కొడుక్కి గట్టిగా ఉత్తరం రాశాడు. జవాబు రాలేదు. ఇంకో రెండు నెలలు గడిచాయి. "మీరు వెళ్ళకపోతే నేనే వెళ్తా"నని పెళ్ళాం బయలు దేరింది. ఆ రోజు నాలుగు చీవాట్లు వేసినా ఆ మరునటి రోజు తనే పెళ్ళాం మీద నున్న జాలీ, గౌరవంతో బయలుదేరాడు.

హాస్టలులో లేడు. ఎవరో మిత్రుడి ఇంట్లో ఉన్నాడని తెలిసి అక్కడకు తిరిగి తిరిగి తెలుసుకుని వెళ్ళేసరికి పొద్దు అటు వాలింది. కొడుకు లేడు. కొడుకు మిత్రుడూ లేడు. వాడి తండ్రి ఉన్నాడు. ఫలానా అని తెలుసుకున్నాక లోపలికి ఆహ్వానించాడు. కాఫీ తాగుతూనే మాటల్లో పడ్డారు. సుబ్బారావు లాంటి సామాన్య కుటుంబంలానే ఉంది. తనలానే కష్టపడి సంసారం ఈదుతున్న మనిషిలా ఉన్నాడు.

"మావాడి స్నేహితుడు కదా—వీడికీ మావాడి బుద్ధులే అబ్బి ఉండాలి. అసలు మావాడ్ని పాడు చేసినవాడు వీళ్ళబ్బాయేనేమో?" అని మనసులో అనుకుని మాటలు ముభావంగా దొర్లిస్తుంటే అతగాడి పుత్రుడు వచ్చాడు. వాడి వేషం బాబు వేస్తున్న వేషంలానే ఉంది. కానీ వీడినడత చూస్తుంటే ముచ్చట వేస్తోంది. తన కొడుకు తనతో ఎంత ఘోరంగా సంచరించి తన్ను ఇలా ఎలా ఈడ్చుకొచ్చాడో చెప్పుకుందామనుకుంటే— "ఉండండి. ఇంకో మిత్రుడి ఇంట్లో చూశాను. పిల్చుకుని వస్తాను" అని ఆ కుర్రాడు వెళ్ళాడు.

"మీ అబ్బాయిని చూస్తుంటే పోయిన ప్రాణం వస్తోంది. మీ రెంత అదృష్టవంతులండీ! మీ చెప్పుచేతల్లో, నమ్మకంగా, వినయంగా ఉన్న అబ్బాయిని కన్న. . ."

"ఆగండి. . .ఆగండి. . ." అన్నా డా తండ్రి.

"వాడు నా కొడుకు కాదు,"

"ఇంకెవరు?"

"కాలేజీకి వెళ్ళేవరకే నా అబ్బాయి. తరవాత వాడు నా తమ్ముడు—నా స్నేహితునితో సమానం. ఇద్దరం ఈ విషయం తెలుసుకున్నాం కాబట్టి ఎవరి మర్యాద వాళ్ళకు దక్కుతూంది" అన్నాడు.

సుబ్బారావుకి ఎందుకో చివుక్కుమంది.

"తప్పులు చేసినా వూరుకుంటారా?"

"తప్పులు చెయ్యనీయండి. చేసిన తప్పులనించి గుణపాఠం నేర్చుకోనీయండి. అప్పుడే స్వతహాగా ఆలోచించగలడు. నిల్చోగలడు."

ఇంతలో ఆ అబ్బాయి వచ్చి "ఎక్కడికో బయలు దేరుతున్నాడు. మీరు వచ్చారని చెప్పాను. అక్కడికి తీసుకు రమ్మని చెప్పాడు. నాతో రండి" అన్నాడు.

పొంగి పొరలి వచ్చిన కోపాన్ని అణచుకుని మౌనంగా సెలవు తీసుకుని ఆ కుర్రాడి వెంట పడ్డాడు. మాటాడినా కాస్త గుండె బరువు తగ్గేది. తను అనుకున్నట్టే వాళ్ళిద్దరూ వెళ్ళేసరికి బాబు లేడు.

ఆ ఇల్లు బాగా కలవారిదిలా ఉంది. కుర్రాడు లేడుగానీ కుర్రాడి తండ్రి చాలా బరువుగా ఉన్నాడు. డబ్బుతో పాటు శరీరం బరువెక్కినట్టుంది. బట్టతల నిగనిగ లైట్ల వెలుగులో మెరిసి పోతూంది. ఆ పెద్ద డ్రాయింగు రూం, అందులో గోడలూ, సోఫాలూ, బొమ్మలూ అన్నీ నీటుగా నిండుగా ఉన్నయ్.

"బాబు మీ అబ్బాయా? చాలా మంచి కుర్రాడు" అన్నాడతను.

సుబ్బారావు ఏడవలేక వికారంగా నవ్వాడు. ఇంతలో ఆ పెద్దవాని కొడుకు, తన సుపుత్రుని మిత్రుడు గబగబ వచ్చి — "డాడ్! వెయ్యి రూపాయలు కావాలి" అన్నాడు. ఎందుకని అడక్కుండా మౌనంగా చెక్కు రాసి తండ్రి ఇచ్చేస్తుంటే సుబ్బారావు విస్తుపోయి చూస్తున్నాడు. ఆ కుర్రాడు వెళ్ళాక మనసు కట్టుకోలేక అడిగేశాడు.

"ఎందుకని అడక్కుండా వెయ్యి రూపాయలు ఇచ్చేశారే?" అన్నాడు.

"ఎలా సంపాదించావు డాడీ అని వాడు నన్ను అడగనప్పుడు, ఎందుకని నేను అడగడం భావ్యమా?" అన్నాడు అతను చిరునవ్వుతో.

"మనం కాస్త వయసు మళ్ళాక చాలా మమకారాలు పెంచుకుంటాం కదండీ?"

"తప్పా?"

"మనలో అందుకే కరప్షన్ పెరిగిపోతుంది."

"ఎలాగ?"

"మనకి డబ్బు కావాలి. ఆరోగ్యం కావాలి. అన్నీ కావాలి."

"అంటే . . .?"

"ఇంట్లో పెళ్ళాం, పిల్లలు, సేవకులు, అందరి మీదా పెత్తనం చెలాయించాలన్న ఉబలాట— అంటే అర్థం అయిందా?"

"కాలేదు."

"అంటే నేనొక నవాబుని. నా చుట్టూ ఉన్న వాళ్ళంతానా భార్య, పిల్లలతో సహా అంతా బానిసలు. నేను రాజకీయ వాదినైతే నా చుట్టూ ఉన్నది జనం. ఆఫీసర్ని అయితే నాకింద పని చేసేవాళ్ళు. ఇలా ఈ వెధవ బానిసత్వం ఒక ఎత్తులో ఉన్న ప్రతివాడూ, ప్రతి చోటా క్రిందున్న వాళ్ళనించి కాంక్షిస్తున్నాడు. ఈ కాలేజీలో, యూనివర్సిటీల్లో అల్లకల్లోలం ఎందుకంటారు?"

"అసలు వీళ్ళు చదువుకు వెళ్తేనా?"

"మీ అబ్బాయి, మా అబ్బాయి, అందరబ్బాయిలూ చదువుకే వెళ్ళారు. నా కొడుకుని నేను బానిసగా చూసినంత కాలం నాకు వాడు మర్యాద ఇవ్వలేదు. వాడ్ని స్వతంత్రంగా వదిలేశాను. బాధ్యత తెలుసుకున్నాడు. అందుకే నేనిచ్చిన వెయ్యి రూపాయల చెక్కు సద్వినియోగం చేస్తాడన్న నమ్మకం నాకుంది. ఆ ప్రొఫెసర్ విద్యార్థుల్ని బానిసగా చూసినంత కాలం ఈ అల్లకల్లోలం తప్పదు. మీ అబ్బాయి యూనివర్సిటీలో బానిసగా ఉండడానికి ఒప్పుకోలేదు. అందుకే మీ వాడంటే నాకు అంత గౌరవం."

సుబ్బారావు లేచిపోయాడు.

"అబ్బాయిని చూడకుండా వెళ్ళిపోతారా?"

"నన్ను కలుసుకోవాలని ఉంటే వాడు ఎందుకు వెళ్ళిపోతాడు?"

అతగాడు లేచి సుబ్బారావును కూర్చోబెడుతూ అన్నాడు.

"మనిషి ఏం చేసినా, ఏదో ఒక కారణం ఉంటుందని మరిచిపోకండి. ఈ నిజం మీరు తెలుసుకుంటేనేగాని అసలు మనిషిని మీరు అర్థం చేసుకోలేరు. మనిషి ఒక కాంప్లికేటెడ్ మెషిను. దాన్ని నడిపే చాకచక్యం మీ అబ్బాయి సంపాదించాడు కాబట్టే తలెత్తుకు తిరుగుతున్నాడు. సంపాదిస్తున్నాడు. బ్రతుకుతున్నాడు. దయచేసి మీ అబ్బాయిని అపార్థం చేసుకోకండి."

కొడుకు సంపాదిస్తున్నాడు బ్రతుకుతున్నాడు. అంతలో బగాల్న వచ్చాడు—బాబు నవ్వుతూ లోనికి వచ్చాడు. "అమ్మా, చెల్లెలూ బాగున్నారా?" తొలి ప్రశ్న. శుభావంగా జవాబు మౌనంగానే!

"ఏమయ్యా బాబూ? మీ నాన్నగారు వచ్చినా కలవకుండా ఇంత హడావుడిగా ఎక్కడికి పోయావు?"

బాబు ఎదురుగా కూర్చుంటూ

"మాలాంటి కుర్రాళ్ళం హీరో కోసం వెతుకుతుంటాం కదండీ? వెతగ్గా వెతగ్గా ఎందరో పుస్తకాల్లోనూ, సినిమాల్లోనూ ప్రత్యక్షంగానూ కనుక్కున్నాక. . .ఇందులో ఎవరు అసలు హీరో అన్న అనుమానం వస్తుంది కదా! ఇతనే నా హీరో అని నేను ఎంచుకున్న రచయిత ఈ పూట వచ్చాడు. అతను రాసిన పుస్తకం ఒకటే నన్నెంతో ప్రభావితుణ్ణి చేసింది. అతను నన్ను కలుసుకుంటానని ఒప్పుకున్న సమయం మా నాన్నగారు వచ్చిన సమయం ఒకటే అయిపోయింది. ఆయనను రైలు స్టేషనులో దిగబెట్టి వస్తున్నాను. రండి నాన్నా వెళదాం!" అన్నాడు.

"మాతోపాటు భోజనం చేసి మరీ వెళ్తారు" అన్నాడు ఇంటి పెద్ద.

భోజనం టేబిలు—వడ్డించిన రుచులు తింటూ—సుబ్బారావు అనుకున్నాడు.

"నా ఇంట్లో డైనింగు టేబిలే బెస్టు—

మా ఆవిడ వండిన వంటకాలే బెస్టు—

మా పిల్లలే బెస్టు—మా ఆచారాలే బెస్టు—

మా వంశమే బెస్టు—నా వంతా బెస్టు అనుకుంటే ఈ డైనింగు టేబిలు ఎంత బాగుంది? ఈ వంటకాలెంత రుచిగా ఉన్నాయ్. వీళ్ళావిడ ఎంత నమ్రతతో ఎంత నీట్‌గా ఉంది? వీళ్ళ జీవిత విధానం, వీళ్ళ నడత, వీళ్ళ భావాలు—ఎంత మనోహరంగా, అమృతంగా ఉన్నాయి. ఎదుటివాళ్ళ జీవితాల్లోనూ ఇంత గొప్ప రుచు లుంటాయని ఇంతవరకు ఎందుకు తెలుసుకోలేక పోయాను. . .?"

"అసలు నా కొడుకు నా చేతినించి జారిపోయాక నూతన భావాల రుచులతో ఎంత ఉన్నతంగా ఎదిగి పోయాడు!"

నవ్వుల కొడుకు డైనింగు టేబుల్ మీద అంటించిన పద్యంలో ఆఖరి చరణాలు జ్ఞప్తికి వచ్చాయి.

ఇప్పుడు ఆ పద్యం అంతా పూర్తిగా పఠించుకుంటే కోసం బరువు కళ్ళల్లో ఆనంద బాష్పాలు తిరిగాయి.

★


